క్లుప్తంగా

నేడు పట్టాల పంపిణీ

హుడాకాంప్లెక్స్: జీవో నంబర్ 58, 59కు సంబంధించిన పట్టాల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటలకు సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి సబితారెడ్డి హాజరు కానున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ఆలయానికి పూజా సామగ్రి



పూజా సామగ్రి అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని జిన్నాయి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సోమవారం బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన రేణుక రాజరాజేశ్వరి పీఠం ఎం నవీన్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. నగరానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి దంపతులు స్వామి వారి నిత్య పూజ కోసం వెండి వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జీ శివశంకర్, పూజారి మురళి పాల్గొన్నారు.

తిరుమల హిల్స్ కాలనీలో కంటి వెలుగు శిబిరం



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ నర్సింహ

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ తిరుమల హిల్స్ కాలనీ రోడ్ నంబర్ – 10లో సోమవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ పీ నర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కాలనీ వాసులంతా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఉన్నవారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పీ శివపార్వతి, కాలనీ అధ్యక్షులు రాము, రఘు, సతీష్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా శ్రీనివాస్‌రెడ్డి



మీర్‌పేట: మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా హుజూర్ నగర్ పట్టణానికి చెందిన న్యాయవాది డీ శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. జీవో నంబర్ – 152 ద్వారా న్యాయ శాఖ కార్యదర్శి నర్సింగ్‌రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పదవిలో మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆస్తి పన్నుపై 5శాతం రాయితీ

30లోపు చెల్లించిన వారికి వర్తింపు

పహాడీషరీఫ్: 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ నెల 30 తేదీ లోపు ఆస్తి పన్ను చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.వసంత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. గతేడాదికి సంబంధించి మున్సిపాలిటీలో రూ.5.5 కోట్ల ఆస్తి పన్ను వసూలు అయ్యిందన్నారు. ఐదు శాతం రాయితీ పొందేందుకు ప్రవేశపెట్టిన ఎర్లీ బర్డ్ పథకాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు.

సద్వినియోగం చేసుకోండి

తుక్కుగూడ: 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ముందుగా చెల్లిస్తే 5శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని గృహాలు, వాణిజ్య సముదాయాలకు రాయితీ వర్తిసుందని తెలిపారు. ఈ నెల 30 తేదీ వరకు అవకాశం ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

హుడాకాంప్లెక్స్: సీజ్ చేసిన స్కూల్‌ని నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఓయూ విద్యార్థుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం సరూర్‌నగర్ ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అనుమతులు లేని కారణంగా అధికారులు శ్రీ చైతన్య పాఠశాల సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అయినా యాజమాన్యం యథావిధిగా పాఠశాలను నడుపుతోందని, వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



తుక్కుగూడ: రావిర్యాల పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు



కందుకూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

మొదటిరోజు పరీక్ష ప్రశాంతం



మీర్‌పేట: జిల్లెలగూడ పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ పరిశీలిస్తున్న ఉపాధ్యాయుడు

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలో సోమవారం మొదటిరోజు 10వ తరగతి ఫస్ట్ ల్యాంగ్వేజ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రంలో 210 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

పది పరీక్షలు ప్రారంభం

తుక్కుగూడ: మున్సిపాలిటీలో సోమవారం నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. రావిర్యాల, తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులను నిర్వాహకులు తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

కందుకూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్షకు 764 మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు. కందుకూరు చౌరస్తాలోని నోబుల్ స్కూల్ కేంద్రంలో 250 మందికి అందరూ హాజరయ్యారు. కందుకూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 119 మందికి గాను 119 మంది, నేదునూరు మోడల్ స్కూల్ – బి కేంద్రంలో 200 మందికి గాను 200 మంది హాజరయ్యారు. నేదునూరు మోడల్ స్కూల్ – ఏ కేంద్రంలో 195 మందికి గాను 194 మంది హాజరవగా ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు.

మహేశ్వరంలో

మహేశ్వరం: మండలంలోని పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మహేశ్వరం బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో, దేవేంద్ర విద్యాలయం – ఏ, – బీ, మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్ – ఏ, బీ, కొంగర రావిర్యాల జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల, తుక్కుగూడ జెడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,967 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి రోజు ఫస్ట్ ల్యాంగ్వేజ్ పరీక్షకు 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ కృష్ణ తెలిపారు.

ఓపెన్ జోన్ ఎత్తివేయాలని వినతి

కలెక్టర్‌ను కోరిన పలు కాలనీల ప్రజలు



కలెక్టర్ హరీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

బడంగ్‌పేట్: ఓపెన్ జోన్‌లో ఉన్న కాలనీలకు విముక్తి కల్పించి రెసిడెన్సియల్ జోన్‌గా మార్చాలని కోరుతూ సోమవారం కలెక్టర్ హరీష్‌కు పలు కాలనీ వాసులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాల వల్ల ఈ తప్పిదం జరిగిందని అన్నారు. హెచ్‌ఎండీఏ ఏర్పడక ముందే 148, 149 సర్వే నంబర్లల్లో ఏర్పాటు చేసిన వెంచర్‌లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నామని గుర్తు చేశారు. ఇళ్లన్నీ నిర్మించుకున్న తర్వాత హెచ్‌ఎండీఏ అధికారులు ఓపెన్ జోన్ కింద మార్పు చేయడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అశంగారి రెడ్డి కాలనీ, రోమా –2, శ్రీలక్ష్మీ కాలనీలు ఓపెన్ జోన్ కిందకు చేర్చారన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌కు ట్యాక్సులు, నల్లా బిల్లులు చెల్లిస్తున్నా ఓపెన్ జోన్ ఉండడంతో ఇంటి పర్మిషన్లు ఇవ్వడంలో, బ్యాంకులు రుణాలు ఇవ్వడంలో ఇబ్బందులు పెడుతున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కలెక్టర్‌ను కలసిన వారిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బీ జంగారెడ్డి, సంక్షేమ సంఘాల ప్రతినిధులు బీ డానియల్, శంకర్, ప్రమోద్ ఉన్నారు.

మంత్రి సబిత రాజీనామా చేయాలి

కాంగ్రెస్ నేత భాస్కర్‌రెడ్డి డిమాండ్



కొత్తపేట చౌరస్తాలో మంత్రి సబిత దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

హుడాకాంప్లెక్స్: పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం నేత దేప భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొత్తపేట చౌరస్తాలో సోమవారం సబిత దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. సబితారెడ్డి నిర్లక్ష్యం కారణంగా విద్యాశాఖ భ్రష్టు పట్టిందన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ ప్రకంపనలు మరువక ముందే 10వ తరగతి పేపర్ లీకేజీతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు శివప్రసాద్, గణేశ్‌నేత పాల్గొన్నారు.

రూ. 9.41కోట్లతో తండాలకు రోడ్లు

మంత్రి సబితారెడ్డి



మహేశ్వరం: నియోజకవర్గంలోని తండాల్లో పక్కా రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 9.41 కోట్లను మంజూరు చేసిందని మంత్రి సబితారెడ్డి సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులకు త్వరలో టెండర్లు పిలిచి ఆరు నెలల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పెద్దమ్మ తండా నుంచి కొత్తూరు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.50 కోట్లు, చిన్న తూప్రా నుంచి పెద్దమ్మ తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.98 కోట్లు, ఘట్టుపల్లి తండా నుంచి దావూద్‌గూడ తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.80 కోట్లు, నాగారం నుంచి పడమటి తండా వరకు రోడ్డు విస్తరణ, బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.12 కోట్లు, మైలార్‌బాయి తండా నుంచి కొత్త తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.52 కోట్లు, కందుకూరు మండలం సార్లరావులపల్లి నుంచి పోతుబండ తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.48 కోట్లు మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. ఇందుకు సబంధించిన పనులను వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ రోడ్ల నిర్మాణాలతో గిరిజన ప్రాంతాల రూపురేఖలు మారనున్నాయని మంత్రి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని సబితారెడ్డి తెలిపారు. భవిష్యత్తులో తండాలకు మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.

కొమురయ్య త్యాగాలు చిరస్మరణీయం



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుర్మ సంఘం నాయకులు

సహకార సంఘం డైరెక్టర్ బాలయ్య

మహేశ్వరం: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య త్యాగాలు చిరస్మరణీయమని మహేశ్వరం సహకార సంఘం డైరెక్టర్ పీ బాలయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప గుడి వద్ద దొడ్డి కొమురయ్య 96వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రదాత దొడ్డి కొమురయ్య అన్నారు. వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. నేటి తరం యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుర్మ సంఘం మండల నాయకులు కే కృష్ణ, ఏ బాలయ్య, ఎం బాల్‌రాజ్, జే రామస్వామి, పీ కిష్టయ్య, పీ యాదయ్య, ఎం యాదగిరి, సురేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌పై అనర్హత వేటు దారుణం



రాహుల్‌గాంధీకి మద్దతుగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప వంశంలో పుట్టిన రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం దారుణమని, ఇదంతా బీజేపీ కుట్రలో భాగమేనని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్, నాయకులు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, సొడపు వెంకటేష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. ప్రధాని మోదీ నియంతగా మారి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. తన మిత్రుల కోసం మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను ధారాదత్తం చేస్తూ దేశ సంపదను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. అదాని కుంభకోణంపై ప్రశ్నించడమే రాహుల్‌గాంధీ చేసిన తప్పా అని నిలదీశారు. రాహులుగాంధీకి దేశం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సీ గణేష్‌నాయక్, ఎండీ ఖాజామొయినుద్దీన్, బీ పాండురంగారెడ్డి, జీ సుధాకర్‌రెడ్డి, ఎం శ్రీశైలం, వీ బాబు, ఎండీ సల్మాన్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు మరమ్మతులు పూర్తి



కల్వర్టు వద్ద రోడ్డుకు మరమ్మతులు

కందుకూరు: మండల కేంద్రంలోని హైదరాబాద్ – శ్రీశైలం రహదారిపై రోడ్డు మరమ్మతు పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. కొన్ని రోజుల క్రితం కందుకూరు చౌరస్తాలో కల్వర్టు నిర్మించారు. మరమ్మతు పనులు చేయకుండా వదిలేశారు. దీంతో వాహనాలు తరచూ ప్రమాదాల బారిన పడేవి. వాహనచోదకులు, ప్రయాణికులు గాయపడేవారు. దీనిపై సాక్షి దిన పత్రికలో మార్చి 1న కల్వర్టు నిర్మించారు.. మరమ్మతులు మరిచారు శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ సమస్యను పరిష్కరించాలంటూ కొత్తగూడకు చెందిన లాయర్ ఓంరెడ్డి ఇటీవల కాంట్రాక్టర్‌పై పీఎస్‌లో కేసు పెట్టాడు. ఎట్టకేలకు స్పందించిన కాంట్రాక్టర్ ఆదివారం రాత్రి రోడ్డు మరమ్మతులు పూర్తి చేయించారు.

ప్రతిఒక్కరిలో సేవాభావం ఉండాలి



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో పంచాయతీ కార్యదర్శి నరేందర్ తదితరులు

మహేశ్వరం: మండలంలోని తుమ్మలూరు ప్రభుత్వ పాఠశాలలో నగరంలోని నాంపల్లికి చెందిన ఇందిర ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం వలంటీర్లు సోమవారం శ్రమదానం చేశారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డీ వల్లీ సౌభాగ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు రావన్నారు. అంతకుముందు వలంటీర్లు గ్రామంలో పర్యటించి రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటి నీరు పోశారు. ఇంకుడు గుంతలు, నీటి ప్రాముఖ్యత, తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో తుమ్మలూరు పంచాయతీ కార్యదర్శి నరేందర్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి కృషి అభినందనీయం

ఎంపీపీ సుకన్య

యాచారం: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు గాను దివ్యాంగుడైన బొడ్డు శేఖర్ యాచారం మండల కేంద్రంలో చలివేంద్రం ప్రారంభించడం అభినందనీయమని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో దివ్యాంగుడు బొడ్డు శేఖర్ అతని స్నేహితులు మేదరి వెంకటేష్, శివలింగం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ చలివేంద్రాన్ని సోమవారం ఎంపీపీ కొప్పు సుకన్య ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం యాచారం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడం కోసం బొడ్డు శేఖర్ సొంత ఖర్చులతో చలివేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, సీఐ లింగయ్య, యాచారం పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మాసబ్ చెరువులో మట్టిని తొలగించండి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి సర్వే నంబర్ 205లోని మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో డంప్ చేసిన మట్టిని తొలగించే వరకు ఊరుకునే ప్రసక్తే లేదని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధన్‌రాజ్ గౌడ్ అన్నారు. సోమవారం మట్టిని తొలగించడానికి మున్సిపాలిటీ నుంచి రూ.5 లక్షలను కేటాయించామని.. అధికారులు సహకరించి మట్టిని తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, ఇరిగేషన్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నారని కవిత, కంబాలపల్లి ధన్‌రాజ్, కాకుమాను సునీల్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ గ్రామ అధ్యక్షుడిగా పవన్‌కల్యాణ్

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన కావలి పవన్ కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా పవన్‌కల్యాణ్‌తో పాటు కార్యవర్గాన్ని నియమించారు. విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు రాజేశ్, కడ్తాల్ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు శ్రీకాంత్, దర్శన్, మహేందర్, మోహన్, పవన్ ఉన్నారు.

రోడ్డు పునర్నిర్మాణంపై హర్షం



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ యాదగిరి, సయ్యద్ ఖాజా పాషా

పహాడీషరీఫ్: జల్‌పల్లి కమాన్ రోడ్డు పునర్నిర్మాణంపై 16వ వార్డు బీజేపీ కౌన్సిలర్ బీ యాదగిరి హర్షం వ్యక్తం చేశారు. రూ. 2కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులను సోమవారం ఆయన పార్టీ నాయకుడు సయ్యద్ ఖాజా పాషాతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ రోడ్డు రెండు కిలోమీటర్ల మేర గుంతలమయంగా మారడంతో వాహనచోదకులు నిత్యం అవస్థలు పడేవారన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించడంతో నిధులు మంజూరు చేశారని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

పోషకాహారంపై గర్భిణులకు అవగాహన



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని లెనిన్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిషోర బాలికలకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువల గురించి అవగాహన కల్పించారు. ఆకు కూరలు, చిరు ధాన్యాలు, గుడ్లు, పాలు తీసుకోవడం వల్ల కలిగే లాభాలను అంగన్‌వాడి టీచర్లు వివరించారు. రక్తహీనత రాకుండా తల్లులకు పోషక విలువలతో వంట ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్ఞానకుమారి, అంగన్‌వాడీ టీచర్లు సీ రాజేశ్వరి, ఏ సంగీత, ఎస్ సరోజ, జే లలిత, సీహెచ్ సుకన్యకుమారి, ఆరోగ్యలక్ష్మి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్వప్న



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ స్వప్న

హయత్‌నగర్: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేస్తున్నామని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో రూ. 6లక్షల వ్యయంతో నిర్మించన్ను సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎం శ్రీధర్‌రెడ్డి, నాయకులు జే శ్రీరాములు, సీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందంజ

అభివృద్ధిలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ముందంజలో నిలుస్తుందని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణారెడ్డి అన్నారు. సోమవారం 20వ వార్డులో స్థానిక కౌన్సిలర్ జోర్క గీతాశ్రీరాములుతో కలిసి రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కుంట్లూరులో అభివృద్ధి పనులకోసం అధిక నిధులు తీసుకొచ్చామని.. కాలనీలు విస్తరిస్తున్నందున అభివృద్ధి వేగంగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సయ్యద్ హజ్రత్‌బేగం, జోర్క లక్ష్మణ్, రవి, సాదు మురళి, జోర్క వీరయ్య వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.